
సాక్షి వికారాబాద్

శుక్రవారం । 14 । మార్చి । 2025




అడుగుకో గుంత..

మోమిన్‌పేట – మైతాబ్‌ఖాన్‌గూడ మార్గంలో గుంతల కారణంగా ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. 10లో▸



సీఎంఆర్ అందజేయాలి

వానాకాలానికి సంబంధించిన సీఎంఆర్‌ను అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ మిల్లర్లను ఆదేశించారు. 10లో▸



న్యూస్‌రీల్

హోలీ శుభాకాంక్షలు
స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: రాష్ట్ర ప్రజలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను స్నేహితులు, కుటుంబసభ్యులతో సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. శరీరానికి హాని కలిగించని రంగులను వినియోగించాలన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అనంతగిరి: వికారాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రయాణికులకు ఎదురవుతున్న సమస్యలు, సూచనలను సెల్ నంబర్ 9959226252కు కాల్ చేసి తెలియజేయాలని కోరారు.

తాండూరులో..

తాండూరు టౌన్: తాండూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఎం సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలు, సలహాలను సెల్ నంబర్ 9959226251కు కాల్ చేసి తెలపాలన్నారు. ఉదయం 10నుంచి 11 గంటల మధ్య కాల్ చేయవచ్చని తెలిపారు. చేసి తెలియపరచాలన్నారు.

16న మెగా జాబ్‌మేళా

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 16న ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా నిరుద్యోగుల కోసం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు క్యాంపు కార్యాలయ వర్గాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీ ఫాక్స్‌కాన్ వారి సౌజన్యంతో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జాబ్‌మేళా ఉంటుందన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన మహిళా నిరుద్యోగులు తమ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్లు 9739693954, 8688547057లో సంప్రదించాలన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీబీ శీతల్

అనంతగిరి: చట్టాలపై నేటి యువతకు అవగాహన ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని ఎస్ఏపీ కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో బాధ్యతగల పౌరులుగా మెలగాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేష్, రాము, శ్రీనివాస్, ప్యానల్ న్యాయవాది రాజశేఖర్, ప్రిన్సిపాల్ మందారికా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పథకాన్ని రద్దు చేయాలి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎంశ్రీ పథకాన్ని వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీస సాయిబాబ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు గురువారం సీఐటీయూ నాయకులతో కలిసి సీడీపీఓ షబానా బేగంకు వినతిపత్రం అందజేశారు.

దాహం.. దాహం

సాక్షి ఫోకస్ — కన్నీటి కష్టాలు

ఏటా వేసవిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిసినా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లోనూ నీటి సమస్య ఉంది. పట్టణ ప్రజలకు సరిపడా నీరు సరఫరా కావడం లేదు. వికారాబాద్‌లో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. తాండూరు, పరిగి పట్టణాల్లో కూడా ప్రజలకు నీటిపాట్లు తప్పడం లేదు. కొడంగల్ పట్టణంలో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది.



కొడంగల్: ఆలేడులో బోరు వద్ద ఖాళీ బిందెలతో మహిళలు

వికారాబాద్ మున్సిపాలిటీలో తాగునీటికి అవస్థలు

- రోజు విడిచి రోజు సరఫరా
- పట్టణ జనాభా 70వేలు, నల్లా కనెక్షన్లు 10,600
- నిత్యం 14 ఎంఎల్‌డీ నీరు అవసరం
- ప్రస్తుతం సరఫరా చేస్తున్నది 10.4 ఎంఎల్‌డీలే

వికారాబాద్: మున్సిపల్ పరిధిలో రోజు తప్పించి రోజు తాగునీరు సరఫరా అవుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా దాదాపు 90 శాతం మేర నీటి అవసరాలు తీరుతున్నాయి. మిగతా లోటును బోరు బావులు, హ్యాండ్ పంపుల ద్వారా తీరుస్తున్నారు. పైప్‌లైన్ లీకేజీలు పెద్ద సమస్యగా మారింది. దీంతో తాగునీరు కలుషితమవుతోంది. ప్రజలు ఆ నీటిని తాగలేక వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. పైప్‌లైన్లు వేసే సమయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవటం వల్ల తొందరగా లీకేజీ అవుతున్నాయి. చాలా కాలనీల్లో నల్లా కనెక్షన్‌కు ఉన్న ట్యాపులు, మీటర్లను తొలగించారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి

మున్సిపల్ పరిధిలో 16వేల నివాసాలు.. 70 వేల జనాభా, 10,600 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. రోజుకు ఒకరికి 100 లీటర్ల చొప్పున నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన వికారాబాద్ మున్సిపాలిటీకి రోజుకు 7 ఎంఎల్‌డీ(మిలియల్ లీటర్ ఫర్ డే) నీరు అవసరం. ప్రస్తుతం రోజు తప్పించి రోజు సరఫరా చేస్తున్నారు. రెండు రోజులకు 14 ఎంఎల్‌డీ నీరు అవసరం కాగా 10.4 ఎంఎల్‌డీలే సరఫరా అవుతోంది. వీటితో పాటు మున్సిపల్ పరిధిలో 198 బోరు బావులు, 56 చేతి పంపులు ఉన్నాయి. నల్లాలు లేని చోట వాటిని వినియోగిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి సమస్యలు తలెత్తితే శివారెడ్డిపేట్ చెరువును నుంచి సరఫరా చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

దాహం తీరుస్తున్న కృష్ణమ్మ

కొడంగల్: మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కృష్ణమ్మ ప్రజల దాహం తీరుస్తోంది. కొడంగల్, పాత కొడంగల్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్, ఐనన్‌పల్లి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణ శివారులో సిద్దనొంప సమీపంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్లుటీపీ) నుంచి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేసి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ పరిధిలో తాగునీటి సమస్య లేదని కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిత్యం నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా చూస్తామన్నారు.



కొడంగల్‌లోని నీటి శుద్ధి కేంద్రంలో ఎగిసి పడుతున్న కృష్ణాజలాలు

తాగునీటికి తిప్పలు



తాండూరు పట్టణంలోని 11వ వార్డులో ఏడాదిన్నరగా నీళ్లు రాని కుళాయి

తాండూరు: మున్సిపల్ పరిధిలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఏడాదిన్నర క్రితం మిషన్ భగీరథ పథకం కింద పలు వార్డుల్లో పైప్‌లైన్లు వేసి, ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ఇచ్చారు. కానీ ఇప్పటి వరకు తాగునీరు సరఫరా కావడం లేదు. పాత తాండూరు, మల్‌రెడ్డిపల్లి, ఎన్‌టీఆర్ కాలనీ, రాజీవ్ గృహకల్ప కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. మున్సిపల్ పరిధిలో 36 వార్డులు.. 14,706 గృహాలు ఉన్నాయి. మొత్తం 80 వేల జనాభా ఉంది. నిత్యం 9 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంటుంది. కాగ్నా నది వద్ద రెండు పంప్ హౌజ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా పట్టణంలోని 6వేల ఇళ్లకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. మరో రెండు వేల ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చినా సరఫరా కావడం లేదు. ఎన్‌టీఆర్ కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించి ఏళ్లు కావస్తున్నా అందుబాటులోకి తేలేదు. 325 బోరు మోటార్లు, 122 చేతి పంపులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో కొన్ని పాడయ్యాయి.

గొంతు తడపని 'మిషన్ భగీరథ'



పరిగి పట్టణంలోని 5వ వార్డులో అలంకారప్రాయంగా మిషన్ భగీరథ నల్లా కనెక్షన్

పరిగి: మున్సిపల్ పరిధిలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పట్టణంలోని 5వ వార్డు (వేంకటేశ్వస్వామి ఆలయం చుట్టూ ఉన్న కాలనీలకు ఏడాదిగా నీటి సరఫరా కావడం లేదు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్ మరమ్మతులకు కాలనీ వాసుల నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం పట్టణంలోని చాలా కాలనీల ప్రజలు సొంత బోర్ల ద్వారా నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. పాత పరిగి, మరి కొన్ని కాలనీలకు మాత్రమే రోజూ నీటి సరఫరా జరుగుతోంది. పరిగి మున్సిపాలిటీలో 34,500 మంది జనాభా ఉండగా వారికి నిత్యం 42,22,500 లీటర్ల నీరు అవసరం. ప్రస్తుతం మున్సిపాలిటీలో 3.60 ఎంఎల్‌డీ బల్క్ వాటర్ అందుబాటులో ఉంది. మిషన్ భగీరథ ద్వారా 1.67 ఎంఎల్‌డీ నీరు సరఫరా చేస్తున్నారు. మోటర్ల ద్వారా 1.25 ఎంఎల్‌డీ నీరు, రెండు సంపుల ద్వారా దాదాపు 5లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇవి కాకుండా 72 బోర్లు, 15 ట్యాంకులు ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. వేసవిలో తాగునీటి కోసం రూ.15లక్షలు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

ఆదర్శ కవయిత్రి మొల్ల
ప్రొఫెసర్ విజయలక్ష్మి



వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: రామాయణ మహా గ్రంథాన్ని సరళ భాషలో రచించిన మొల్ల జీవితం మహిళా లోకానికే ఆదర్శమని ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఏ విజయలక్ష్మి అన్నారు. గురువారం పట్టణంలోని విశ్వవేద పాఠశాలలో కవయిత్రి మొల్ల కళావేదిక ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కవయిత్రులు జ్వలిత, మంజుశ్రీ, సక్కుబాయిలకు మొల్ల సాహిత్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఆ తర్వాత విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మొల్ల కళా వేదిక ఫౌండర్, అధ్యక్షుడు వెంకట్, ప్రధాన కార్యదర్శి వంశరాజు, కవులు రవీందర్, బాలకృష్ణ, బసవరాజు, కోటం చంద్రశేకర్, యూసుఫ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అక్రమాలు సహించేది లేదు

షాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనులు సక్రమంగా జరిగేలా చూడాలని డీఆర్‌డీఓ శ్రీలత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధిహామీ భవనంలో 2023–2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు ఉపయోగపడే పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. మొక్కలు నాటడం, వాటి సంరక్షణ, వ్యవసాయ పొలాల్లో కాలువలు తవ్వడం, పొలాలను చదును చేయడం, గట్లు పోయడం వంటి పనులు చేపట్టాలని సూచించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అపర్ణ, ఏపీడీ చరణ్‌గౌతమ్, ఏఈవో కొండయ్య పాల్గొన్నారు.



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

మెరుగైన వైద్యం | మన బాధ్యత

- కలెక్టర్ ప్రతీక్‌జైన్


పూడూరు: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందేలా వైద్యాధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. గురువారం పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, కల్పించాల్సిన సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మందులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రి భవనాన్ని, పరిసరాలను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యసేవలు అందించాలని అన్నారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. అవసరం మేరకు లైట్లు, ఫ్యాన్లు సమకూర్చుకోవాలని సూచించారు. రోగులు, గర్భిణులకు అందుతున్న సేవలను డాక్టర్ దేవికారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఇంకా ఏమైనా అవసరం ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భరత్‌గౌడ్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- తిరుమల తరహాలో నిత్య కైంకర్యాలు
- రోజూ శ్రీవారికి వాహన సేవలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ ధర్మకర్తలు



ముస్తాబైన ఆలయ శిఖరం



శ్రీవారి మూలమూర్తి

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన శ్రీవారి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ధర్మకర్తలు ఏర్పాట్లు చేస్తున్నారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కలియుగ వైకుంఠ దైవం పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల ఇలవేల్పుగా నిలిచిన శ్రీవారి ఉత్సవాలను వేద పండితులైన బ్రాహ్మణులు తిరుమల తరహాలో నిర్వహించడం ఇక్కడి ఆనవాయితీ. తిరుమల తిరుపతి వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహించే ఉత్సవాల్లో నిత్యం వాహన సేవలు, నిత్య కైంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ కనుల పండువగా కొనసాగుతాయి. గతం నుంచి వస్తున్న ఆచార సంప్రదాయాలను కొనసాగించడానికి ధర్మకర్తలు సిద్ధమయ్యారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున శేష వస్త్రాలను సమర్పిస్తారు.

నిత్య కార్యక్రమ వివరాలు

24వ తేదీ సోమవారం కోవిలాళ్వార్ల తిరుమంజనం, 25న మంగళవారం సేనాధిపతి ఉత్సవం, అంకురార్పన, 26న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేషవాహనం, 27న చిన్న శేషవాహనం, హంసవాహనం, 28న సింహవాహనం, వ్యాళి వాహనం,29న కల్పవక్ష వాహనం, సర్వభూపాల వాహనం, అమావాస్య పూలంగి సేవ, 30న మోహినీ అవతార ఉత్సవం, ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శేష వస్త్రాలు సమర్పన, 31న హనుమంత వాహనం, వసంతోత్సవం, గజవాహ నం, ఏప్రిల్ 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 2న రథోత్సవం, అశ్వవాహనం వీధి ఉత్సవం, 3న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 3గంటలకు ఉత్సవర్లకు అభిషేకం, సాయంత్రం 7గంటలకు ఊంజల్ సేవ, శ్రీ బాలాజీ పాదుతా తీయగా కార్యక్రమం, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు భజన కార్యక్రమాలు ఉంటాయి.



అనంతగిరి: రంగులు కొనుగోలు చేస్తున్న జనం



దుద్యాల్: అల్లాఖాన్‌పల్లి పాఠశాలలో హోలీ సంబురాలు జరుపుకొంటున్న విద్యార్థులు



వికారాబాద్ పట్టణంలో కాముని దహనం

హోలీ సందడి

హోలీ పండుగ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. పలుచోట్ల రంగుల దుకాణాలు వెలిశాయి. చిన్నారులు రంగులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. రాత్రి పలుచోట్ల కాముని దహనం చేశారు. శుక్రవారం పాఠశాలలకు సెలవు కావడంతో విద్యార్థులు ముందస్తు వేడుకలు జరుపుకొన్నారు. రంగులు చల్లుకొని సందడి చేశారు.

– అనంతగిరి

క్లుప్తంగా

ఉపాధి కూలీల బిల్లులు చెల్లించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి మైపాల్


సమావేశంలో మాట్లాడుతున్న మైపాల్

మర్పల్లి: పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీ డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో పార్టీ నాయకులు, ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూలీ డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం జాప్యం చేయడం సరికాదన్నారు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న పేద రైతులను గుర్తించి వారికి వెంటనే పట్టాలు అందజేయాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, లేబర్ యూనియన్ మండల అధ్యక్షుడు ఆనదం, నాయకులు సంజీవులు, అశోక్, చంద్రయ్య, రాజు, శ్రీనివాస్, లాలిబాయి తదితరులు ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం


లక్ష్మయ్య(ఫైల్)

దోమ: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన దోమ పీఎస్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన నందార్‌పేట్ లక్ష్మయ్య(52) తన భార్య మొగులాలీతో తరుచూ గొడవ పడుతూ ఉండేవాడు. బుధవారం గొడవపడిన ఆయన బొంరాస్‌పేట్ మండలం సాలిండాపూర్‌లోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. గురువారం తిరిగి ఇంటికి వస్తూ బ్రాహ్మణపల్లి తండా సమీపంలోని ఓ గేదెల షెడ్‌లో రాడ్డుకు తాడుతో ఉరేసుకున్నాడు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి మృతుడి భార్యకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి


ధన్‌రాజ్(ఫైల్)

దోమ: బైక్‌తో ట్రాలీని ఢీకొట్టిన ఘటనలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మోత్కూరు గ్రామానికి చెందిన సండి ధన్‌రాజ్(18), సండి సాయికుమార్ పరిగి వెళ్తున్న క్రమంలో మైలారం గేట్ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీని బలంగా ఢీకొట్టిన విషయం విదితమే. ఈ క్రమంలో క్షతగాత్రులను కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో ధనరాజ్ మృతి చెందగా.. సాయికుమార్ పరిస్థితి సైతం విషయమంగానే ఉందని ఎస్‌ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆటో

ద్విచక్ర వాహనదారుడి మృతి


బక్క రాజు(ఫైల్)

మొయినాబాద్: బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన బక్క రాజు(35) బాలాజీ ఆలయం వద్ద టెంకాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 9గంటల ప్రాంతంలో రాజు తన బైక్‌పై హిమాయత్‌నగర్ వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా చిలుకూరు మహిళ ప్రాంగణ సమీపంలో ఎదురుగా వస్తున్న అశోక్ లేలాండ్ ఆటో అతి వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్రగాయాలవడంతో గమనించిన స్థానికులు స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడు చేరుకుని మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం. కేసు దర్యాప్తులో ఉంది.

అడుగుకో గుంత.. ప్రయాణం చింత

శంకర్‌పల్లి మార్గానికి బదులుగా సంగారెడ్డి మీదుగా వెళ్తున్న ప్రయాణికులు


హైదరాబాద్ వెళ్లే రోడ్డు దుస్థితి

మోమిన్‌పేట: మండల వాసులు నగరానికి వెళ్లాలంటే శంకర్‌పల్లి మీదుగా సమీపం మార్గం ఉంటుంది. కానీ వీరు మాత్రం వయా సదాశివపేట, సంగారెడ్డి మీదాగా వెళ్లాల్సి వస్తోంది. శంకర్‌పల్లి మార్గమంతా గుంతలమయంగా మారడంతో చేసేది లేక దూర భారమైనా చుట్టూ తిరిగి వెళ్తున్నారు.

బీటీ రోడ్డు వేయాలి

మోమిన్‌పేట నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ వరకు 19 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కానీ ఈ మార్గంలో ప్రయాణించాలంటేనే జనం జంకుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కనీసం గుంతలు పూడ్చేందుకు సైతం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏన్కతల, దేవరంపల్లి, చక్రంపల్లి, చీమల్‌దరి, బాల్‌రెడ్డిగూడెం ప్రజలు తప్పక శంకర్‌పల్లి రోడ్డు మీదుగానే వెళ్తున్నారు. మిగిలిన మండలాల వారు వయా సదాశివ్‌పేట మీదుగానే ప్రయాణిస్తున్నారు. రియల్ వ్యాపారం మండలంలో రెండేళ్ల క్రితం జోరుగా సాగింది. ఒక ఎకరా రూ.4కోట్ల వరకు ధరలు పలికాయంటే పరిస్థితి ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వం ప్రకటించిన హెచ్‌ఎండీలో నాలుగు పంచాయతీలు విలీనం కానున్నాయని.. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని బీటీ రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఆటోవాలాలను ఆదుకోవాలి

సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రయ్య

బొంరాస్‌పేట: ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంతో జీవనోపాధి కోల్పోతున్న ఆటోవాలాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన తుంకిమెట్ల వద్ద ఆటో యూనియన్ సభ్యులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.12వేల జీవనోపాధి పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేపడతామని హెచ్చరించారు. ఆటోవాలలకు అడ్డాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం నుంచి గుర్తింపుకార్డులు, ఆరోగ్యబీమా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు గౌతమ్‌శ్రీను, రాజు, మల్లేశం, రవి, రుక్యా, నరేశ్, శేఖర్, అశోక్, ఉస్మాన్, మొగులయ్య తదితరులున్నారు.


ఆటోయూనియన్ నాయకులతో చంద్రయ్య

సీఎంఆర్ ధాన్యం అందజేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్


మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: వానాకాలం పంటలకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వానికి సత్వరమే అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్‌లో రైస్‌మిల్లర్స్, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. సీఎంఆర్ డెలివరీ చేయనివారిపై, ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. 2024–25 వానాకాలం సీజన్‌లో పాలుపంచుకున్న మిల్లర్లు అందరూ వరి ధాన్యానికి బ్యాంక్ గ్యారంటీ తప్పనిసరి అందజేయాలన్నారు. లేదంటే తదుపరి సీజన్‌లో వారికి వరి ధాన్యం అలాట్‌మెంట్ ఉండదని చెప్పారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, డీఎం వెంకటేశ్వర్లు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీధర్ రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల నియామకానికి చర్యలు

బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం నుంచి ఫారం 6, 7, 8 పెండింగ్, రాజకీయ పార్టీల సమావేశాలు, బూత్ స్థాయి ఏజెంట్ నియామకం తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మార్చి 19 లోగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూతు స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫారం 6, 7, 8 పెండింగ్‌లో ఉంటే ఈ నెల 21లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నేహమత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దురుసు ప్రవర్తన


ధారూరులో ఎక్స్‌ప్రెస్ బస్సు నిలిపివేయడంతో పల్లె వెలుగు బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

- జీపీఆర్‌ఎస్‌కు అనుసంధానమైన ఫోన్ లాక్కెళ్లిన హెడ్ కానిస్టేబుల్
- బలరాంపై పోలీసులకు ఫిర్యాదు చేసిన డ్రైవర్ షఫీ

ధారూరు: ఆర్టీసీ బస్సు వెనుకాలే వస్తున్న కారు ఓ స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సును తగులుకుంటూ ముందుకెళ్లింది. కారు గీతలు పడడంతో సదరు యజమాని బస్ డ్రైవర్ ఫోన్ తీసుకెళ్లి స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. ఈ ఘటన గురువారం వెలుగుజూసింది. వివరాలు.. బుధవారం వికారాబాద్ నుంచి తాండూరు వైపు ఆర్టీసీ బస్సు ప్రయాణిస్తోంది. మోమిన్‌పేట్ సీఐ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది బలరాం కారు బస్సు వెనుకాలే వస్తోంది. అనంతగిరి సమీపంలోని జింక బొమ్మ రోడ్డు మలుపులో స్పీడ్ బ్రేకర్ వద్ద బస్సు స్లోగా వెళ్తుండడంతో కారు బస్సు వెనుక నుంచి రాసుకుంటూ కొంత దూరం వెళ్లగా గీతలు పడ్డాయి. వెంటనే బలరాం బస్సును ఆపి డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. డ్రైవర్‌ది తప్పు కానప్పటికీ బ్రతిమాలి డబ్బు ఇస్తానని చెప్పినా వినకుండా ఫోన్ ఇవ్వకుండా వెళ్లాడని ఆరోపించాడు. దీంతో డ్రైవర్ ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా తమ పరిధిలోరి రాదని, వికారాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్‌ఐ అనిత సూచించారు.

24 గంటలపాటు స్విచ్ఛాఫ్

బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో నా ఫోన్ జీపీఆర్‌ఎస్‌కు అనుసంధానంగా ఉంటుంది. హెడ్ కానిస్టేబుల్‌దే తప్పని అందరు చెప్పిన నా ఫోన్ తీసుకుని పోయి 24 గంటల పాటు స్విచాఫ్ చేసుకున్నారు. చివరకు వికారాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశా. మోమిన్‌పేట సీఐ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న బలరాం ఫోన్ ఇవ్వాలని కోరితే రూ. 15వేలు డిమాండ్ చేస్తున్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఐ భీంకుమార్‌ను కోరారు. కాగా సీఐని వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేరు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి


దాతలను సన్మానిస్తున్న నారాయణరెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం గాజీపూర్‌లోని చెన్నకేశవ ఆలయ పునఃనిర్మాణానికి దాతలు సహకరించాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి అన్నారు. గురువారం ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. గాజీపూర్‌లో వెయ్యి ఏళ్ల క్రిందటి చెన్నకేశవ ఆలయం శిథిలావస్థకు చేరడంతో దాతల సహకారంతో పునఃనిర్మిస్తున్నామన్నారు. ఈ మేరకు దాతలు డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, తాండూరు పట్టణానికి చెందిన వి.రాజేశ్, ఎల్.పవన్ విరాళం అందజేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, లాల్‌రెడ్డి, వీరప్ప, సాయిలు, రవి, వీరేందర్, సంగమేశ్వర్, నాగర్జునరెడ్డి, బిచ్చన్న, రాములు, రాంచెంద్రి, అంజి, వెంకటయ్య, రాంరెడ్డి, వేణు, సాయి, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

భవనం పైనుంచి పడి వృద్ధుడి మృతి

మొయినాబాద్: మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలైన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పీఎస్ పరిధిలోని కనకమామిడిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దింటి గోవింద్‌రెడ్డి(75) కుటుంబం మొదటి అంతస్తులో నివాసముంటున్నారు. బుధవారం రాత్రి బయట ఏదో గొడవ జరుగుతుందని చూడటానికి ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు. మొదటి అంతస్తుకు రేలింగ్ లేకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడ్డిన ఆయన్ను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వృద్ధుడు గురువారం సాయంత్రం మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

ఆర్టీసీ డ్రైవర్ మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


సుధాకర్(ఫైల్)

షాబాద్: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన షాబాద్ ఠాణా పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామానికి చెందిన మొగిలిగిద్ద సుధాకర్, కొత్తపల్లి బాలయ్య బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. అదే గ్రామానికి చెందిన తిమ్మక్క రజినీకాంత్ తన ద్విచక్రవాహనంపై వెళ్తున్న క్రమంలో అంతారం స్టేజీ వద్ద ఈ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సుధాకర్, రజనీకాంత్ తీవ్రంగా గాయపడడంతో షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిగి డిపోలో ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న సుధాకర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బాలయ్య స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

భార్యను కడతేర్చిన భర్త

రహమత్‌నగర్ : కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి భార్యను హత్య చేసిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన నరేందర్ స్థానికంగా మిల్క్ బూత్ నిర్వహిస్తున్నాడు. అతడికి భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంత కాలంగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి కూడా వారి మధ్య మరోసారి గొడవ జరగడంతో ఆగ్రహానికి లోనైన నరేందర్ పద్మ(50)ను గొంతు నులిమి హత్య చేశాడు. గురువారం ఉదయం బోరబండ పోలీసుల ఎదుట లొంగి పోయాడు. సంఘటనా స్థలాన్ని వెస్ట్ జోన్ డీసీపీ విజయ్‌కుమార్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ దుర్మరణం

ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి

- ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న క్షతగాత్రుడు
- ఈనెల 31న ఉద్యోగ విరమణ.. అంతలోనే ప్రమాదం

శంకర్‌పల్లి: ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన మరో వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మోకిల ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మోకిలలో నివాసముంటున్న రవీందర్(60), ఉమాదేవి(56) దంపతులు గత బుధవారం రాత్రి 8గంటల సమయంలో స్కూటీపై నార్సింగికి వెళ్లి వస్తున్నారు. ప్రొద్దటూరు గేటు సమీపంలోని సుభిషి టౌన్‌షిప్‌లో టీ తాగేందుకు వాహనాన్ని యూ టర్న్ చేస్తుండగా.. మెహదీపట్నం నుంచి శంకర్‌పల్లి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వీరిని ఢీకొట్టింది. దీంతో ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు హుటాహుటిన శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఉమాదేవిని సంగారెడ్డికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. రవీందర్ ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో గచ్చిబౌలి సన్‌షైన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉమాదేవి మృతదేహానికి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. రవీందర్ దంపతుల కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తీరని విషాదం

ప్రమాదంలో గాయపడిన రవీందర్ ఎక్సైజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలిసింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసే కొడుకుతో కలిసి ఉమాదేవి మోకిలలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా రవీందర్ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఇంతలోనే ఇలా జరగడం బాధిత కుటుంబంలో తీరని విషాదం నిపింది.

ప్రభుత్వ చొరవతోనే అభివృద్ధి

ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల

చేవెళ్ల: మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని భారత జాతీయ మహిళా సమాఖ్య(ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల అన్నారు. గురువారం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జనభాలో సగభాగం ఉన్న మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను సైతం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మహిళల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 20శాతం మహిళలు పౌష్టికాహార లోపం వల్ల రక్తహీనతతో భాదపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య నాయకురాలు వెంకటమ్మ, నాయకురాళ్లు లలిత, విజయమ్మ, రమాదేవి, వినోద, సుగుణమ్మ, అంజమ్మ, జయమ్మ, యాదమ్మ, రాములమ్మ, చంద్రకళ, సీపీఐ నాయకులు కె. రామస్వామి, వడ్ల సత్యనారాయణ, బాబురావు, యాదగిరి, శ్రీకాంత్, పెంటయ్య, తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మంజుల

బహిరంగ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాశ్‌గౌడ్

మోమిన్‌పేట: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సభ హుందాతనానికి మచ్చ తెచ్చే విధంగా స్పీకర్‌ను ఏక వచనంతో సంబోధించడం సరికాదన్నారు. పదేళ్లపాటు మంత్రి పదవిలో ఉండి కూడా సభ సంప్రదాయాలను తుంగలో తొక్కడం బాధాకరమన్నారు. వెంటనే క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు బయట తిరగనీయరని ఆయన హెచ్చరించారు.

బంట్వారంలో..

బంట్వారం: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డిని సభ నుంచి సస్పెండ్ చేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బంట్వారం మండల అధ్యక్షుడు పోచా రం వెంకటేశం డిమాండ్ చేశారు. జగదీశ్వర్‌రెడ్డి వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.

బర్తరఫ్ చేయాలి

అనంతగిరి: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను అవమానపరిచిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని పదవి నుంచి తప్పించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లేశం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా స్పీకర్‌ను దూషించడం సిగ్గుచేటన్నారు.

వర్గీకరణ చేపట్టే వరకు పోరాటం


రిలే దీక్షలలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పి.కృష్ణమాదిగ

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ అన్నారు. వర్గీకరణ చేపట్టే వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలనే డిమాండ్‌తో చేపట్టిన దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. దీంతీక్షలో కిశోర్‌కుమార్‌మాదిగ, సురేశ్, విజయ్‌కుమార్, సాయి, విజేందర్, మహేశ్, సచిన్, పవన్‌లు కూర్చున్నారు. ఈ సందర్భంగా పి.కృష్ణమాదిగ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా పోరాడుతున్నా వర్గీకరణ చట్టబద్ధత కల్పించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, కుమార్, శ్రీను, మహేశ్, సురేశ్, బాలరాజు, శ్రీకాంత్, కృష్ణ, శివ, నర్సింహ, కుమ్మరసంఘం నాయకులు నాగేశ్, బాలకృష్ణ, రమేశ్, తిరుపతి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌లో అత్యవసర పంపింగ్‌కు సన్నాహాలు..!

- డెడ్‌స్టోరేజీకి మరో 11 అడుగుల్లో నీటి మట్టం
- ముందస్తు ఏర్పాట్ల కోసం టెండర్ల ఆహ్వానం
- చర్యలకు ఉపక్రమించిన జలమండలి

సాక్షి,సిటీబ్యూరో: మహానగరానికి తాగునీటిని సరఫరా చేసే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరే అవకాశాలు ఉండటంతో అత్యవసర పంపింగ్ ఏర్పాట్ల కోసం జలమండలి ముందస్తు సన్నాహాలు చేపట్టింది. వేసవి ఆరంభంలోనే సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం డెడ్ స్టోరేజీకి 11 అడుగుల దూరంలో ఉండటంతో అత్యవసర పంపింగ్ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జలమండలి అత్యవసర పంపింగ్ కోసం గురువారం టెండర్లను ఆహ్వానించింది. మొత్తం మూడు ప్యాకేజీలో రూ.5.95 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టాలని నిర్ణయించింది. 10 రోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి .. ప్రాజెక్టులో నీటి మట్టం ఆధారంగా వర్క్ ఆర్డర్ ఇవ్వాలని యోచిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా, గురువారం నాటికి 521 అడుగులకు చేరింది. అయితే జలాశయం నీటి మట్టం 510 అడుగులకు పడిపోతే అక్కంపల్లి రిజర్వాయర్‌లోకి గ్రావిటీ ద్వారా రావాల్సిన నీటిని తరలించే పరిస్థితి ఉండదు. సాగర్‌లోని ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు నుంచి పుట్టంగండి పంప్ హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారానే నీటిని సేకరిస్తున్నారు. నీటి మట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకుంటే కృష్ణాజలాల పంపింగ్ నిలిచిపోయి అత్యవసర పంపింగ్ తప్పదు.

రోజువారీగా 0.068 టీఎంసీలు డ్రా..

నగర తాగు నీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ నుంచి గ్రావిటీ ద్వారా ప్రస్తుతం రోజువారీగా 0.068 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 312.01 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 151.470 టీఎంసీలు అందుబాటులో ఉండగా 131.66 టీఎంసీ వరకు నీటి లభ్యత ఉంటుంది. డెడ్ స్టోరేజ్ ఉన్నా..2.05 టీఎంసీలను నీటి వాడుకోవచ్చు. అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మొత్తం నీటిమట్టం 1.499 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.201 టీఎంసీల నీరు అందుబాటులో ఉంది.

వరుసగా రెండో సారి

గతేడాది కూడా నాగార్జున సాగర్‌లో అత్యవసర పంపింగ్ ద్వారా నీటిని తరలించారు. మొదట 2017లో సాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర మోటర్లు ఏర్పాటు చేసి ఆ ఏడాది సెప్టెంబర్ వరకు నీటిని పంపింగ్ చేశారు. సరిగ్గా ఎనిమిదేళ్ల తర్వాత గతేడాది నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరడంతో అత్యవసర పంపింగ్ ఏర్పాటు చేసి నీటిని తరలించారు.